రిజిస్ట్రేషన్లు జోరు లబ్ధిదారుల్లో హుషారు

- పేదల ఇళ్ల పట్టాలకు సచివాలయాల్లో శరవేగంగా రిజిస్ట్రేషన్లు
- లబ్ధిదారులకు ఇళ్లపై సంపూర్ణ హక్కులు
- 19వేలకు పైగా కుటుంబాలకు లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

తుని రూరల్: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. దీనిలో భాగంగా మరో అడుగు ముందుకేసి లబ్ధిదారుల ఇళ్ల పట్టాలకు సచివాలయాల్లో ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసేలా చర్యలు తీసుకున్నారు. సొంతింటి కలను నెరవేర్చడమే కాకుండా ఆ ఇంటిపై లబ్ధిదారులకు సర్వహక్కులు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేస్తోంది. ప్రస్తుతం నియోజకవర్గంలోని అన్ని గ్రామ సచివాలయాల్లోనూ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. దీంతో లబ్ధిదారులకు ఆ ఆస్తి(ఇళ్ల)పై సంపూర్ణ హక్కు లభించనుంది. ప్రాంతాలను బట్టి రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షల వరకూ ఆస్తి మహిళల సొంతమవుతోంది.

నియోజకవర్గంలో 50 శాతం పూర్తి

ప్రభుత్వ నిర్ణయంతో తుని నియోజకవర్గంలో 19వేలకు పైగా కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే 50 శాతానికి పైగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్ల డిజిటల్ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను అధికారులు లబ్ధిదారులకు అందించనున్నారు.

సొంతింటి కల సాకారం

అద్దె ఇళ్లలో అవస్థలు పడుతున్న పేద, వెనుకబడిన వర్గాల సొంతింటి కల సాకారమవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలు చొప్పున రుణాలు మంజూరు చేసింది. తుని నియోజకవర్గంలో వేసిన ప్రత్యేక లే అవుట్లలో 19 వేలకు పైగా ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు కేటాయించారు. ఆయా స్థలాల్లో ప్రభుత్వం తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక వసతులు కల్పిస్తుండడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేశారు. కొన్ని కుటుంబాలు ఇప్పటికే ఇళ్లను నిర్మించుకుని గృహ ప్రవేశాలు సైతం చేశారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో వేలాది మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి కొంతకాలంగా కొత్త ఇళ్లల్లోనే జీవనం సాగిస్తున్నారు. అద్దె బాధలు తప్పడం, సొంతింటి కల తీరడంతో ఆయా కుటుంబాలు ప్రశాంతంగా జీవిస్తున్నాయి.



ఎస్.అన్నవరం సచివాలయంలో జగనన్న కాలనీ ఇళ్లస్థలాలకు రిజిస్ట్రేషన్లు చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో, కార్యదర్శులు



రిజిస్ట్రేషన్ల తర్వాత లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులతో అందించనున్న ఆస్తి పత్రాలు

రూ.10 లక్షల ఆస్తిపై హక్కు



దీర్ఘకాలం పాటు అద్దె ఇళ్లలో అవస్థలు పడ్డాం. గతేడాది జగనన్న కాలనీలో ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల రుణాన్ని మంజూరు చేశారు. ఆ సొమ్ముతో ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు ఆ ఇంటికి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. దీంతో నా పేరున రూ.10 లక్షల విలువైన ఆస్తి సమకూరింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి దాడిశెట్టి రాజాకు రుణపడి ఉంటాం.

– దేవవరపు కనకమహాలక్ష్మి, లబ్ధిదారు, ఎస్.అన్నవరం

రిజిస్ట్రేషన్‌తో ధైర్యం వచ్చింది



జగనన్న కాలనీలో స్థలం ఇచ్చి రుణం మంజూరు చేయడంతో ఇల్లు నిర్మించుకున్నాం. రెండు నెలల కిందట గృహ ప్రవేశం చేశాం. కరెంటు, తాగునీరు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయడంతో జగనన్న కాలనీలో కట్టుకున్న ఇంట్లోనే కాపురం ఉంటున్నాం. ఆ స్థలానికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడంతో ఎంతో ధైర్యం వచ్చింది.

– శెట్టి చక్రమ్మ, లబ్ధిదారు, ఎస్.అన్నవరం

సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



పాలెం ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

కిర్లంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని పాలెంలో ఆదివారం అడారి వీరబాబు అధ్యక్షతన పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట రాంజీ, పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, అడబాల సుబ్బారాయుడు, అడారి రాంబాబు, కరణం కోటేశ్వరరావు, అడారి లక్ష్మణ్, ఓలేటి రాజు, కామెర్ల శివ బాబు, బేరి బాబ్జీ, పాతంశెట్టి కృష్ణమూర్తి, సరిసే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు టి.తిమ్మాపురంలో మంత్రి రాజా పర్యటన

తుని రూరల్: మండలంలోని టి.తిమ్మాపురంలో సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు గ్రామంలో మంత్రి రాజా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా బల్లల పండగ



ఏలేశ్వరంలో శివపార్వతులకు పూజలు చేస్తున్న రజకులు, వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలోని రజకులు ఆదివారం బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సాయిబాబా మెట్ట సమీపంలోని ఏలేరు నది ఒడ్డున పండగ నిర్వహించారు. తొలుత శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అంజూరి రాజారావు, దాకమర్రి లోవరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో పేదలకు మేలు



సిరిపురంలో ప్రజలకు కేంద్ర పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు మండలంలోని సిరిపురంలో ఆదివారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో అవినీతి పాలన అందిస్తున్నారన్నారు. సూర్యోదయ యోజన పథకం ద్వారా కోటి ఇళ్లకు 300 యూనిట్ల వరకూ ఉచిత సోలార్ విద్యుత్ అందించనున్నట్టు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కురాకుల రాజా, దాకే కృష్ణారావు, రెడ్డి లోవరాజు, కందా వీరాస్వామి, కర్రి ధర్మరాజు, గోగుల అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

తుని: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ సూచించారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో ఆదివారం జాతీయ, రాష్ట్ర, జిల్లా, పట్టణ స్థాయిలో వివిధ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే ఏదో ఒకటి సాధించాలని ఆకాంక్ష ఉంటుందన్నారు. తమ పాఠశాల విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహిస్తోందన్నారు. విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అనంతరం క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన, 100 శాతం హాజరు కనబరిచిన 900 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అన్నదానం



ఏలేశ్వరంలో అనాథ పిల్లలకు అన్నదానం చేస్తున్న దుర్గారావు

ఏలేశ్వరం: పట్టణంలోని అనాథ పిల్లలకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. స్థానిక మార్స్ కంప్యూటర్స్, డిస్ట్రిక్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకుడు అడపా దుర్గారావు తన తల్లి సత్యవతి జ్ఞాపకార్థం స్వామి దయానంద సరస్వతీ అనాథ ఆశ్రమంలోని పిల్లలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో దాడిశెట్టి వీరబాబు, కోరాడరాజు, ఉడతల రమణారావు, కావలి శ్రీను, పిచ్చెట్టి కృష్ణ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల
- లింగంపర్తిలో సొసైటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



లింగంపర్తిలో నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న వరుపుల సుబ్బారావు



ఏలేశ్వరంలో ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గం

ఏలేశ్వరం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని లింగంపర్తిలో ఆదివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆర్బీకేలను ఏర్పాటు చేసి రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడంతో పాటు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులకు బీమా సౌకర్యం, రుణాలు అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చారని తెలిపారు. కార్యక్రమంలో వరుపుల చిట్టిబాబు, అడపా పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

నూతన చైర్మన్‌గా వరుపుల సూరిబాబు

లింగంపర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా వరుపుల సూరిబాబు, సభ్యులుగా కాశపు వీరబాబు, సోము సూరీడు ప్రమాణ స్వీకారం చేశారు. ఏలేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా ఓలేటి వీరభద్రం (చంటి), సభ్యులుగా దాసరి రమేష్, గూనాపు అప్పలరాజు ప్రమాణ స్వీకారం చేశారు.

వైఎస్సార్ సీపీలో 100 మంది చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్, కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన 100 మంది టీడీపీ శ్రేణులు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో ధర్మవరానికి చేరిన కోన దేవుడు, నక్కా రాజుబాబు, గొంప అప్పారావు, కొల్లా గోవింద్, కొమాల రామకృష్ణ, మురుకుర్తి నాని తదితరులు పార్టీలో చేరగా ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్, పార్టీ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు వారికి కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, గ్రామ సర్పంచ్ బెందుకుర్తి సుశీల, సొసైటీ చైర్మన్ జువ్వల బాబులు, ఎంపీటీసీ జువ్వల సుజాత, పార్టీ నాయకులు జువ్వల చిన్నబాబు పాల్గొన్నారు.

జగనన్న చేసిన మేలు మరవొద్దు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- జగ్గంపేటలో మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ



జగ్గంపేటలో మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న తోట నరసింహం

జగ్గంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు చేసిన మేలును మరిచిపోవద్దని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలోని 1818 మహిళా సంఘాల సభ్యులకు రూ.16.39 కోట్ల విలువైన నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద జగ్గంపేట మండలంలోని 1818 మహిళా సంఘాలకు నాలుగు విడతల్లో రూ.65.57 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని కిర్లంపూడి, జగ్గంపేట, గండేపల్లి మండలాలకు చెందిన 4771 డ్వాక్రా గ్రూపులకు రూ.162.11 లబ్ధి చేకూరిందని వివరించారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళలు జగన్ మోహన్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ యువ నేత తోట రాంజీ, పార్టీ నాయకులు అత్తులూరి సాయిబాబు, గపూర్, ఎంపీడీఓ వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తోట నరసింహం, మహిళలు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- శంఖవరంలో మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ



శంఖవరంలో మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న వరుపుల సుబ్బారావు

శంఖవరం: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం మహిళలకు నాల్గో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలోని 1055 డ్వాక్రా సంఘాల్లో సభ్యులకు రూ.8.5 కోట్లు విలువైన నమూనా చెక్కు అందజేశారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పర్వత రాజు బాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మండలంలోని 1055 డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా నాలుగు విడతల్లో కలిపి రూ.32.22 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం వెంకటరమణ, సర్పంచులు ఈగల విజయదుర్గ, దూడల రాంబాబు, సకురు గుర్రాజు, నరాల తాతబ్బాయి, ఎంపీటీసీలు దడాల సతీష్, చొప్పా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సొసైటీ చైర్మన్ పర్వత సత్యనారాయణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు గాబు కృష్ణ, గింజాల కొండబాబు, గాబు గంగ, అడపా సోమేష్, ఆచంట వెంకటేశ్వరరావు, పడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆసరా సభకు హాజరైన మహిళలు

వైభవంగా మేరీమాత యాత్ర మహోత్సవం



ప్రత్తిపాడు మరియగిరిపై ప్రసంగిస్తున్న పాస్టర్ క్రీస్తురాజు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్తిపాడులో సందడి వాతావరణం



ప్రత్తిపాడులో మేరీమాత పుర ప్రదక్షిణ

ప్రత్తిపాడు: స్థానిక ఆర్‌సీఎం చర్చి పాస్టర్ కె.చిన్నప్ప ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్తిపాడులో మేరీమాత యాత్ర మహోత్సవం వైభవంగా జరిగింది. మరియగిరిపై జరిగిన ఈ వేడుకకు ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం, పిఠాపురం, గొల్లప్రోలు తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో క్రైస్తవ భక్తులు తరలివచ్చారు. ఉదయం స్థానిక ఆర్‌సీఎం చర్చిలో పాస్టర్ చిన్నప్ప ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం మేరీమాత విగ్రహాన్ని తేరుపై ఉంచి, పుర ప్రదక్షిణ చేపట్టారు. బాణసంచా కాల్పుల నడుమ మేరీమాతను ఊరేగించారు. తేరు ఆర్‌సీఎం చర్చి నుంచి బయలుదేరి ఆర్టీసీ కాంప్లెక్స్, మార్కెట్, ఎంప్లాయీస్ కాలనీ మీదుగా మరియగిరికి చేరుకుంది. అనంతరం దివ్య పూజాబలి మహోత్సవాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ క్రీస్తురాజు ప్రధాన దివ్య పూజాబలిని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రతిఒక్కరూ సాటి మానవుని పట్ల కరుణ, ప్రేమతో మెలగాలన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. సామర్లకోట, అనపర్తి, కాకినాడ, రాజమహేంద్రవరం నుంచి వచ్చిన పాస్టర్లు ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం కమిటీ సభ్యులు జి.సత్యానందం, దాసు, వీరరాఘవ, జాయ్, వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన నవదిన ప్రార్థనలు

మరియగిరి కొండపై గత తొమ్మిది రోజులుగా ఆర్‌సీఎం చర్చి పాస్టర్ కె.చిన్నప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు శనివారం రాత్రితో ముగిశాయి. అనంతరం మేరీమాతను ప్రత్యేక పల్లకిలో ఉంచి క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.



జాతరను తలిపించిన ప్రత్తిపాడు మేరీమాత యాత్ర మహోత్సవం

జాతరను తలిపించిన మహోత్సవం

మేరిమాత యాత్ర మహోత్సవం జాతరను తలపించింది. సుదూర ప్రాంతాలకు చెందిన వేలాది మంది మరియగిరి బాట పట్టారు. రహదారి వెంబడి దుకాణాలు వెలిశాయి. యాత్రకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం

తుని: స్థానిక గణపతినగర్ పార్కులో ఆదివారం పట్టణ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు 70 మంది వాకర్లకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. క్లబ్ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దీనిలో భాగంగా తరచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



తునిలో వాకర్లకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

సొసైటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



లంపకలోవ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. సొసైటీ అధ్యక్షుడిగా (త్రిసభ్య కమిటీ చైర్మన్)గా పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన దోనె వెంకట శ్రీనివాస ప్రభాకరరావు (హరిబాబు) సభ్యులుగా పంది వీరభద్రరావు, జి.అర్జున కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన త్రిసభ్య కమిటీ సభ్యులను వైఎస్సార్ సీపీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, పార్టీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, సొసైటీ ఇన్‌చార్జి సీఈఓ అడ్డాల శ్రీను పాల్గొన్నారు.